# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

MAY 2006

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2006 ఏప్రిల్ 8వ తేదీ శనివారం నాడు తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం అగ్రహారములో యున్న క్రీస్తు సంఘం యువకుల కూడిక జరిపించిరి. కాకినాడ నుండి రిక్కీ గూటం గారు సతీ సమేతముగా హాజరై వాక్య పరిచర్య చేసిరి. పరిసర గ్రామముల క్రీస్తు సంఘముల నుండి అనేక యువతీ యువకులు హాజరై గొప్ప సహవాసములో పాల్గొనిరి. అగ్రహారములో యున్న క్రీస్తు సంఘం దేవుని కొరకు మంచి పని చేయుచున్నారు.

ఏప్రిల్ 11వ తేదీ మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడిలో సువార్త చాటుచున్న Ch. దేవిడ్ ఇమ్మానుయేలు గారి మరణవార్త విని రిక్కీ గూటం గారు సతీ సమేతముగా వెళ్ళి ఆయన కుటుంబమును పరామర్శించిరి. దేవిడ్ ఇమ్మానుయేలు గారి కుమారుడు రాజ్‌కుమార్ గారు ఇప్పుడు చింతలపూడిలో సువార్త చాటుచున్నారు.

ఏప్రిల్ 21వ తేదీ శుక్రవారం తాళ్ళరేవు సీతారామపురంలో నున్న క్రీస్తు సంఘము యువకుల సదస్సును ఏర్పాటు చేసిరి. పరిసర స్థానిక సంఘముల నుండి అనేక మంది యువతీ యువకులు హాజరైరి. కాకినాడ సత్యవాణి క్రీస్తు సంఘము నుండి కూడా యువకులు వెళ్ళి ఆ సదస్సులో పాల్గొనిరి. రిక్కీ గూటం గారు వారి సతీమణి సుదీపగూటం గారు కూడ హాజరైరి. ఆనాడు జరిగిన మూడు కూటములలో రిక్కీ గూటం గారు వాక్యపరిచర్య చేసిరి. హాజరైన యువతీ యవకులందరూ దేవుని వాక్యమును బట్టి గొప్పగా ప్రోత్సహించబడిరి. తాళ్ళరేవులో సోదరులు పి. జాన్ విక్టర్ గారు సువార్త చాటుచూ క్రీస్తు కొరకు మంచి పని చేయుచున్నారు. ఆయన సుంకటరేవు అను గ్రామములో కూడా

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O.Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 26 | మే 2006 | సంచిక 10


## క్రైస్తవుడనగా యెవరు ?
## (Who is a Christian)

క్రైస్తవుడనగా యెవరు ? అనే ప్రశ్నను ఈరోజు గమనించుదము. క్రైస్తవుడను పదమును అనేకులు అపార్ధము చేసికొందురు. ఈ పదము ఒక వ్యక్తికే గాని, ఒక జనాంగమునకు లేదా దేశమునకు వర్తించదు.

క్రైస్తవుల యొక్క ఉదార స్వభావమును బట్టియు, నైతిక ఔన్నత్యమును బట్టియు క్రైస్తవ్యము ప్రజలలో ప్రబలమై యున్నది. అయితే ఒకడు నైతికముగా ఔన్నత్య జీవితమును జీవించుచున్న మాత్రమున క్రైస్తవుడు కానేరడు. అతడు ఆత్మీయ యౌన్నత్యమును గలిగినవాడు.

క్రైస్తవుడు అను పదము బైబిలు అంతటిలోను మూడుసార్లు మాత్రమే

వినియోగింపబడెను. మొట్టమొదటిగా అపొ.కా. 11:26లో అది మనకు కన్పించును : "మొట్టమొదట అంతియొకయలో శిష్యులు క్రైస్తవులనబడిరి" యని అక్కడ వ్రాయబడియున్నది. క్రీస్తు యొక్క శిష్యులను దేవుడు తన గ్రంధమందు క్రైస్తవులని పిలెచెను. మనమును వారిని అట్లు పిలువవలెను. అటు తరువాత అపొ.పౌలు అగ్రిప్పరాజు యెదుట నిలువబడి అతడు క్రీస్తు వైపు ఎట్లు మార్పు జెందెనో సాక్ష్యమిచ్చుచుండగా, అగ్రిప్పరాజు, "ఇంత సులభముగా నన్ను క్రైస్తవుని చేయజూచుచున్నావే" యని పలికెను (అపొ.కా. 26:28). ఇక్కడ రెండవసారి క్రైస్తవుడు అనే పదము వినియోగింపబడెను. ఆఖరిగ 1 పేతురు 4:16లో ఆ పేరు మనకు కవ్పడుచున్నది : "ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆపేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను".

క్రైస్తవుడనగా యెవరు ? అతడు ఒక విశ్వాసి. అతడు దేవుని యందును, క్రీస్తునందును విశ్వాసము గలవాడు. యేసు దేవుని కుమారుడని అతడు నమ్మును. "నీవు సజీవుడయిన దేవుని కుమారుడవయిన క్రీస్తువు" అని పేతురు యేసును ఒప్పుకొనెను (మత్తయి 16:16). ప్రతి క్రైస్తవుడు అట్లు నమ్మును, క్రైస్తవుడు కావలెనని కోరు ప్రతివాడు అట్లు నమ్మును, ఏలయనగా క్రీస్తే చెప్పెను. మనము అట్లు నమ్మని యెడల నశింతుము అని దేవుని యందును, దేవుని కుమారుడయిన క్రీస్తునందును విశ్వాసము అత్యవసరము ఏలయనగా విశ్వాసము లేకుండా దేవునికిష్టుడై యుండుట అసాధ్యము (హెబ్రీ 11:6).

జ్ఞానములో క్రైస్తవుడొక శిష్యుడు. తన యజమాని యొద్ద నేర్చుకొనువాడు శిష్యుడు. అతడు వెంబడించువాడు, నేర్చుకొనువాడు. ఒక విద్యార్థి వలె క్రైస్తవుడు నేర్చుకొనునదంతయును యేసుప్రభువు నుండియే నేర్చుకొనును. అతనికిని క్రీస్తుకును మధ్య వేరొకరిని అతడంగీ కరించడు. అతడు అన్ని విషయము లలోను సత్యమునే కోరును. అందుకే యేసు ఇట్లనెను, "మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా

నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" (యోహాను 8:31,32). క్రైస్తవుడు క్రీస్తుయొద్ద నేర్చుకొనువాడు గనుక దేవుని గ్రంధమయిన బైబిలును దీర్ఘముగ పఠించువాడగును. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను తన్ను తాను కనబరచు కొను నిమిత్తము" సత్యవాక్యమును అతడు బాగుగా ఎరిగినవాడగును.

ప్రవర్తనలో క్రైస్తవుడు పరిశుద్ధుడు. ఈ లోకమాలిన్యముల నంటకుండ జీవించువాడు క్రైస్తవుడు. అతడు క్రీస్తుయేసునందు పవిత్రమైన భక్తి గలవాడు; క్రొత్త నిబంధన ఇట్లు చెప్పుచున్నది : "తండ్రియైన దేవుని యెదుట పవిత్రమును, నిష్కళంకమునైన భక్తి యేదనగా – దిక్కులేని పిల్లలను విధవరాండ్రను వారి యిబ్బందిలో పరామర్శించుటయు, ఇహలోక మాలిన్యము తన కంటకుండ తన్నుతాను కాపాడుకొనుటయునే" (యాకోబు 1:27). క్రైస్తవుడు ఆపదలలో యున్న వారికి సహాయము చేయును. ఈ లోక మాలిన్యముల నుండి దూరముగ నుండును. ఈలోక సంబంధమైన విషయములలో ఆసక్తి లేనివాడతడు. అందువలననే నిజక్రైస్తవుడు పరిశుద్ధుడు.

క్రైస్తవులందరు పరిశుద్ధులని బైబిలు బోధించుచున్నది. అయితే 'పరిశుద్ధుడు' లేక Saint అను బిరుదును గూర్చి మాత్రము అది ఎక్కడను చెప్పుటలేదు. అట్టి బిరుదును ఎవరైన ధరించుకొనిన యెడల లేక మరొకరికి ధరింపజేసిన యెడల అతనిని మిగిలినవారికంటే ఉన్నత పదవిలో యుంచినట్లగును. క్రొత్తనిబంధనలో అట్టి స్థానములు ఏమియును క్రైస్తవులకు లేవు.

పలుకుబడిలో లేక ప్రభావములో క్రైస్తవుడు వెలుగైయున్నాడు. అతడు తన వెలుగును ఈ లోకములో ప్రకాశింపజేయును. వెలుగు ఆకర్షించు గుణము గలది. క్రైస్తవుని జీవితము మేలు కలిగించుటకై వెలుగువలె శక్తివంతమైనది. రాత్రి ఎంత చీకటియైనను వెలుగు ప్రకాశించును. ఈ పాపపు లోకములో క్రైస్తవుడు వెలుగు వంటివాడు. అందువల్లనే యేసు తన శిష్యుల నిట్లు

ఆజ్ఞాపించెను : "మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారియెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి" (మత్తయి 5:16). క్రైస్తవుడు ప్రకాశించు వెలుగును బట్టి అనేకులు యేసునొద్దకు వచ్చుట జరుగును.

సంబంధమును బట్టి క్రైస్తవుడు దేవునికి కుమారుడై యున్నాడు. పరమందున్న దేవుడు అతని తండ్రియైయున్నాడు. "మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమని ఆత్మతానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చుచున్నాడు. మనము పిల్లలమయితే వారసులము, అనగా దేవుని వారసులము, క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడినయెడల, క్రీస్తుతోడి వారసులము" అని రోమా 8:16, 17లో అపొ.పౌలు వ్రాసెను. క్రైస్తవుడు క్రీస్తు ద్వారా నిత్యజీవమునకు వారసుడు. క్రీస్తు నందున్న దీవెనలన్నియు క్రైస్తవునికి చెందును.

క్రైస్తవుడు మరణించినవాడు. "క్రీస్తు యేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువ వేసియున్నారు" అని గలతీ 5:24 లో పౌలు గలతీయలో యున్న క్రైస్తవులకు వ్రాసెను. తనను గూర్చి చెబుతూ, "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయ బడియున్నాను ఇకను జీవించువాడను నేనుకాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు" అని గలతీ 2:20లో అతడు వ్రాసెను. క్రైస్తవుడు శరీరేచ్ఛల విషయమై మృతిజెందినవాడు; శరీరాశ నేత్రాశ,జీవపుడంబము అను శక్తులు అతనిపై ప్రభావము లేనివగును. అతడు తన పాత పాపము లను బాప్తిస్మమను నీటి సమాధిలో పాతి పెట్టివేసెను అందువలన ఈలోక విషయాల్లో అతడు మరణించినవాడు ; గాని ...

క్రైస్తవుడు ప్రాణము లేనివాడుకాడు అతడు సజీవుడు ! క్రైస్తవుడు పాపమ విషయమై మృతి నొందినవాడు గాని దేవుని యెడల జీవించువాడు. క్రీస్ ఏలాగయితే సమాధి చేయబడి తిరి లేచెనో అలాగే క్రైస్తవుడు కూ బాప్తిస్మమను క్రియద్వారా నీటి

సమాధి చేయబడి నూతన జీవము పొంది నడుచుకొనునట్లు లేపబడెను. "ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను'' అని 2 కొరింథి 5:17లో అపొ.పౌలు వ్రాసెను. క్రైస్తవుడు సజీవుడు. అతడు క్రీస్తువంటి జీవితమును జీవించును. అందువలన మాటలలోను, క్రియలోను కూడ క్రీస్తువంటి స్వభావమును కలిగి యుండుటకు తన్నుతాను మార్చుకొనును.

క్రైస్తవుడు క్రీస్తు సంఘసభ్యుడై యున్నాడు. ఒకడు యేసునందు విశ్వాసముంచి ఆయన ఆజ్ఞలకు లోబడినప్పు ప్రభువు అతనిని తన సంఘముతో చేర్చును. క్రైస్తవుడు క్రీస్తు సంఘములో తనకుగా తాను చేరలేదు గాని ప్రభువే అతని చేర్చును. ప్రభువు రక్షణ పొందినవారినే తన సంఘములో చేర్చును. యేసునందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు నొంది, యేసును మనుష్యుల యెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినవాడు, రక్షింపబడిన వాడు; అతడు క్రైస్తవుడు. బాప్తిస్మము ద్వారా క్రీస్తును ధరించుకొనినవాడు (గలతీ 3:27). క్రీస్తు సంఘముతో ఎప్పుడయితే అతడు చేర్చబడెనో, లోకమందలి క్రైస్తవులందరు అతనికి అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు అగుదురు (మత్తయి 23:8).

అతనియొక్క గమ్యములో క్రైస్తవుడొక యాత్రికుడు. ఈలోకములో అతడొక యాత్రికుడు మాత్రమే. అబ్రాహాముతో కలసి పరలోక పట్టణము కొరకు అతడు నిరీక్షించువాడు, ఇక్కడ భూమి మీద అనేక శ్రమలు, బాధలు, నిందలు, శోధనలు ఉండవచ్చును గాని అక్కడ అవేమియును ఉండవు. అక్కడ రోగములుండవు, కన్నీరుండదు,ఆకలి దప్పికలుండవు. ఏలయనగా క్రైస్తవుడు తన దేవుని సన్నిధిలో యుండును.

క్రీస్తు యేసునందు నిలిచియున్న వాడు క్రైస్తవుడు. అందుకే యేసుయొక్క శిష్యులు ఆయన వాక్యమందు నిలిచి యుండవలెనని ఆయన హెచ్చరించెను. "మీరు నా వాక్యమందు నిలిచి యున్నవారయితే నిజముగా నాకు శిష్యులై యుందురు" అని ఆయన

చెప్పెను. "ద్రాక్షావల్లిని నేను, తీగెలు మీరు, ఎవడు నాయందు నిలిచియుండునో, నేను ఎవనియందు నిలిచియుండునో వాడు బహుగా ఫలించును; నాకు వేరుగా యుండి మీరేమియు చేయలేరు. ఎవడైనను నాయందు నిలిచియుండని యెడల వాడు తీగవలె బయట పారవేయబడి యెండిపోవును, మనుష్యులు అట్టి వాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు; అవి కాలిపోవును" అని యేసు బోధించెను. (యోహాను 15:5,6).

మిత్రుడా, నీవు క్రీస్తు నందు నిలిచి యున్నావా ? నీవు క్రీస్తులోనికి వచ్చిన వాడవా ? ఆయనలోనికి రావాలంటే ఒకే ఒక్క మార్గమున్నది అది ఆయన యందు విశ్వాసముంచి, విధేయత చూపించు టయే గాని మరొకటి కాదు. నీవును నావలె క్రైస్తవుని వగుటకు ఆశించెదవనియే నా విశ్వాసము !!

–జాషువా గూటం

## సంఘావతరణము

(The Origin of the Church)

సంఘము అకస్మాత్తుగా అవతరించలేదు. అది ముందుగా ఆలోచించబడి, ప్రవచింపబడి, వాగ్దానము చేయబడి స్థాపించబడెను. దీనినంతిటినీ బైబిలు విపులముగ విశదీకరించుచున్నది.

మొదటిగా సంఘము జగత్తు పునాది వేయబడకమునుపే దేవునిచే నిర్ణయించ బడెను. దీనిని పౌలు ఎఫెస్సులోనున్న పరిశుద్ధులకిట్లు తెలియజేసెను: "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వా దమును మనకనుగ్రహించెను. ఎట్లనగా తన ప్రియునియందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపా మహి మకు కీర్తి కలుగునట్లు, తన

చిత్తప్రకారమైన దయాసంకల్పము చొప్పున, యేసు క్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచు కొనెను" (ఎఫెసీ 1:3-6). ఎఫెస్సులో నున్న సంఘమునకు వ్రాయుచూ వారిని దేవుడు జగత్పునాది వేయబడకముందే ఏర్పరచుకొనెనని అతడక్కడ వ్రాయుచున్నట్లు దయచేసి గమనించుము. ప్రపంచములు నిర్మించబడక ముందే దేవుడు సంఘమును గూర్చి ఆలోచించుచున్నట్లు దీన భావము. అనగా ఆ సమయమందు ఆయన దాని నమూనాల నేర్పరచెను. గనుక అది ముందు దేవుని మనస్సు నందు ఉద్భవించెను. ఆదినుండియు దేవునిచే నిర్ణయించబడిన దానిని మనము తక్కువదిగాను, సంకుచితముగాను చేయుట ఎంతయో విపరీతమైన సంగతి.

రెండవదిగా, సంఘము ప్రవచన రీతిగ అనేక పర్యాయములు పలుకబడెను. యెషయా ఇట్లు పలికెను: "అంత్య దినములలో పర్వతముల పైన యెహోవా మందిర పర్వతము పర్వత శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడును. ప్రవాహము వచ్చినట్లు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరు'' (యెషయా 2:2,3). యోవేలు ఇట్లు పలికెను : "తరువాత నేను సర్వజనుల మీద నా ఆత్మకుమ్మరింతును; మీ కుమారులును,కుమార్తెలును ప్రవచనములు చెప్పుదురు; మీ ముసలివారు కలలు కందురు, మీ యౌవనస్థులు దర్శనములు చూతురు. ఆ దినములలో నేను పనివారి మీదను, పనికత్తెల మీదను నా ఆత్మను కుమ్మరింతును" (యోవేలు 2:28,29). అటు తరువాత దానియేలు ఇట్లు సూచించెను : "ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆరాజ్యము దానిని పొందిన వారికి గాక మరెవరికిని చెందదు; అది ముందు

చెప్పిన రాజ్యమున్నిటిని పగుల గొట్టి నిర్మూలము చేయును గాని అది యుగ యుగముల వరకు నిలుచును" (దానియేలు 2:44). ఇప్పుడు కొన్ని అభిప్రాయములను పొందుపరచుదము.

1.స్థాపించబడు రాజ్యము చివరి దినములలో స్థాపించబడును.

2.అది పర్వతములలో స్థాపించబడును.

3. సమస్త జనులు దానిలోనికి ప్రవాహమువలె ప్రవేశింతురు.

4.సమస్త జనుల మీద ప్రభువు తన ఆత్మను కుమ్మరించును.

5.అది నాలుగవ భూసామ్రాజ్య కాలమున స్థాపించబడును.

6.అది రాజ్యముల నన్నిటిని నిర్మూలించును గాని, అది యుగముల వరకు నిలుచును.

ఇదంతయు ఎక్కడ నెరవేరెను ? అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయమును చదువుము.

మూడవదిగా సంఘము వాగ్దానము చేయబడెను. అది సమీపించి యున్నదని యోహాను చెప్పెను (మత్తయి 3:2). అది త్వరలో రాబోవు చున్నదని, త్వరలో స్థాపించబడబోవు చున్నదని దీని యర్థము. క్రీస్తు ఇట్లు వాగ్దానము చేసెను : "మరియు నీవు పేతురువు; ఈ బండ మీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దానియెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పు చున్నాను" (మత్తయి 16:18). "మరియు ఆయన ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచి చూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను" (మార్కు 9:1). ఆయన వారి మనస్సును తెరచి క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలో నుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడి యున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు. ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపు చున్నాను మీరు పై నుండి శక్తి పొందు వరకు పట్టణములో నిలిచి యుండుడని వారితో చెప్పెను" (లూకా 24:46-49)

ఇప్పుడు ఈ క్రింది వాస్తవములను గమనించుము :

1. రాజ్యము సమీపించి యుండెను.

2. దానిని నిర్మించుటకు మరణ మయినను సరే క్రీస్తు వాగ్దానము చేసెను.

3. క్రీస్తుతోనున్న వారిలో కొందరు అది స్థాపించబడునరికి సజీవులై యుందురు.

4. అది బలముతో వచ్చును.

5. సమస్త జనములలో మారుమనస్సు పాపక్షమాపణ ఆయన పేరట ప్రకటించబడును.

6. అది యెరూషలేమునందు ఆరంభమగును.

7. అపొస్తలులు యెరూషలేములో పై నుండి శక్తి పొందెదరు.

సంఘస్థాపనము అను అంశము తెలిసికొనువరకు పై నుదహరించబడిన సంగతులను మనస్సునందు ఉంచు కొనుము. అప్పుడు ఇదంతయు నీకు విడమరచబడును.

అపొస్తలుల కార్యములు రెండవ అధ్యాయమును కొద్దిమారులు పఠించుము. బైబిలు వేత్తలందరు సంఘము ఆ అధ్యాయము చెప్పుకాలము నందు స్థాపించబడెనని ఒప్పుకొందురు. అంతేకాదు, అది యెరూషలేము నందు స్థాపించబడెను. అంత్యదినములలో, రోమా సామ్రాజ్యకాలములో అది స్థాపించబడెను. శక్తి వచ్చెను, సమస్త జనులకు మారుమనస్సు, పాపక్షమాపణలు ప్రకటించబడెను. అప్పటినుండియు సంఘము ఉనికి కలిగియుండెను, గనుక దేవుని మనస్సు నందున్న సంఘము స్థాపించ బడెను. దాని సంబంధమైన ప్రవ చనములు, వాగ్దానములు నెరవేర్చ బడెను.

-జె.సి.ఛోట్

# క్రీస్తు సృష్టింపబడెనా ?

## (Was Christ Created ?)

"ఆయన అదృశ్య దేవుడు స్వరూపియై సర్వ సృష్టికి ఆది సంభూతుడై యున్నాడు" (కొలస్స 1:15).

క్రీస్తు సృష్టింపబడిన వ్యక్తియని ఈ లేఖనము బోధించుటలేదు. ఆయన సృషింపబడిన వ్యక్తియని యెహోవా సాక్షులు అనే గుంపు తప్పుగా బోధిస్తారు. ఆది సంభూతుడు(First Born) అను మాట Protokos అను గ్రీకు పదమునకను వాదము. హోదాలో లేక స్థాయిలో (వరుసలో) ప్రధముడు లేక ముఖ్యుడు అని దాని భావము(It simply denotes that which is first in chief in rank) పాతనిబంధనలో ఇశ్రాయేలు రాజ్యమును గూర్చి చెబుతు "ఎఫ్రాయిము నా జ్యేష్ట కుమారుడు కాడా ?" యని యెహోవా దేవుడు పలికెను (యిర్మియా 31:9) గాని నిజానికి యెసేపు కుమారుడైన ఎఫ్రాయిము మనష్షేకంటే చిన్నవాడు (ఆది.కా. 48:14)అయినను ఎఫ్రాయిము మనష్షే కంటే గొప్పవాడగును గనుక అతడు జ్యేష్ఠుడని పిలువబడెను (ఆది.కా. 48:19).

మెస్సీయను గూర్చి చెప్పబడిన కీర్తన 89:27లో యున్న ప్రవచనము కొలస్స 1:15కు మూలమైయున్నది." కావున నేను అతని నా జ్యేష్ట కుమారునిగా చేయుదును, భూరాజులలో అత్యున్నతునిగా నుంచెదను" అని అక్కడ యున్నది. యూదులు తండ్రియైన దేవుని ఈ లోకానికంతటికి జ్యేష్ఠుడని సంబోదించేవాడు. ఏలయనగా ఆయన సర్వసృష్టికి కారకుడు. అందువలన కొలస్స 1:15లో అపొ.పౌలు దేవత్వము లో రెండో వ్యక్తి అయిన క్రీస్తును కూడ అట్లే వర్ణించుట జరిగినది. క్రీస్తునిత్యుడు, సృజింపబడిన వ్యక్తికాదు (మీకా 5:2; యోహాను 1:1).

-వేయిన్ జేక్సన్

# రక్షింపబడుటకు ఒకడు సంఘసభ్యుడు కావలెనా ?
## (Must One be a Member of the Church to be Saved ?)

"రక్షింపబడుటకు ఒకడు సంఘ సభ్యుడు కానవుసరము లేదు; సంఘము ఎవరిని రక్షించదు; ఒకడు ఏ సంఘ సభ్యుడు కాకుండా క్రైస్తవుడుగా యుండగలడు" అనే సంగతులను మనము సాధారణముగా విను చుందుము. ఒకడు మంచి పౌరుడుగా యుంటే క్రైస్తవునిగా యుండుటతో సమానమని అనేకులు తలంచెదరు. ఈ సంగతులు సత్యమో కాదో మనము పరిశోధించుట మంచిది. అవి సత్యమని బైబిలు బోధించుచున్న యెడల అందరు వాటిని అంగీకరించి, దేవుని చిత్తమని వాటిని బోధించవలెను. అయితే అట్టి భావములకు విరుద్ధముగా బైబిలు బోధించుచున్న యెడల అందరు సమాన బలముతో వాటిని వ్యతిరేకించవలెను. బైబిలు ఈలోకప్రియ సిద్ధాంతములను బోధించుచున్నదా ? యను ప్రశ్నకు మనము జవాబు కనుగొనవలెనంటే లేఖనములను పరిశోధించుట అవుసరము. అప్పుడు రక్షణను గూర్చి, సంఘ సభ్యత్వమును గూర్చి అవి ఏమి బోధించుచున్నవో ఒకడు తెలిసికొన గలడు.

**1. ప్రభువు ఎక్కడ రక్షించును ?**

ప్రభువు రక్షించునని బైబిలు బోధించుచున్నట్లు అందరు అంగీ కరింతురు: మంచివారందరు సంఘము వెలుపల ఉన్నను లేక మరెక్కడ ఉన్నను రక్షించబడుదురు అను భావము బైబిలులో కనబడుచున్నదా ? ప్రశ్న యేమంటే, ప్రభువు రక్షించునదెక్కడ ? సంఘములోనా లేక సంఘము వెలుపలా లేక సంఘమునకు వెలుపల ఒకడు క్రైస్తవుడుగా యుండగలడా ? లేక ప్రభువు సంఘమునకు వెలుపల ఒకడు రక్షింపబడగలడా ? అయితే బైబిలు రక్షకుడెవరోయని బోధించుట మాత్రమే గాక ఆయన ఎప్పుడు ఎక్కడ రక్షించునో కూడ బోధించుచున్నందున ఈప్రశ్నకు బైబిలు జవాబిచ్చును. మానవుడు క్షమాపణ నొందుటకు షరతుల నిచ్చువాడు రక్షకుడే. మరియు రక్షణ

నొందుటకు అతడు దేని ద్వారా ఏ ప్రదేశములో యుండవలెనో ఆయనే చెప్పును. క్రీస్తు ఎప్పుడు ఎక్కడ రక్షించునో చెప్పే హక్కును ఆయన కలిగి యున్నాడని అందరు అంగీకరింతురు. ప్రభువు అందరి రక్షణను కోరుచున్నాడు; అయితే మానవుడు దానిని పొందవలె నంటే దేవుడు దానినెక్కడ ఉంచెనో ఆ ప్రదేశములోనికతడు ప్రవేశించవలెను. "ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పాలగుటకు నియమింపలేదు" (1థెస్స 5:9;2పేతురు 3:9; 1తిమో 2:4; తీతు 2:11).

**A.దేవుడు దాని ఆవరణములో దీవెనలుంచెను**

రక్షణ విషయములో దేవుడు ఎల్లప్పుడు కొన్ని షరతులను, నియమ ములను ఉంచెను. వాటిననుసరింపని వారందరు దానినుండి బహిష్క రింపబడిరి. ఉదాహరణకు నోవహు దినములలో జలప్రళయములో నాశనము కాకుండ దేవుడు మానవులకు రక్షణ నందించెను. గాని ఆ ఓడలో ప్రవేశించుటకు ఎవరయితే యిష్టపడిరో వారికే అది వర్తించెను. ఆ రక్షణను గూర్చి పేతురు ఇట్లు వ్రాసెను; "దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండి నప్పుడు పూర్వము నోవహు దినము లలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారి యొద్దకు ఆయన ఆత్మ రూపిగానే వెళ్ళి వారికి ప్రకటించెను ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణ పొందిరి"(1పేతురు 3:19-20).

ఈ వాక్య భాగము రక్షణ ఓడలో యుండెనని విపులీకరించుచున్నది. ఓడకు వెలుపల యున్న వారందరు నశించిరి. జలప్రళయము నుండి రక్షింపబడే స్థానము మరొకటి లేదు; గనుక ప్రజలు ఆ ఓడలో ప్రవేశింపని యెడల వారు నశించిరి. ఆ వృత్తాంతము చివర ఎనిమిదిమంది మాత్రమే రక్షింపబడిరని కనబడుచున్నది. వారు ఓడలోనికి, రక్షణలోనికి ప్రవేశించిరి. గాని మిగిలిన మానవ జాతి అంతయు ను దేవుని నియమములను పాటించుట లో విఫలులై రక్షణను ఆవరించుకొని యున్న గోడలలోనికి ప్రవేశించలేక పోయిరి ! గనుక వారు నాశన మొందిరి.

నోవహు దినములలో జలప్రళయము నుండి రక్షణను దేవుని షరతులు ఓడలో యుంచినందున, ఈనాడు పాపము నుండి రక్షణను దేవుడు ఎక్కడ ఉంచెను? అనే ప్రశ్న తప్పక వచ్చును; దేవుడు రక్షణను తప్పక సంకల్పించెను మరియు బాధ్యత గలవారందరు రక్షింపబడవలెనంటె కొన్ని షరతులను కూడ ఆయన విధించెను. ఈ నియమ ములకు వేరుగా ప్రజలు రక్షణను ఇంకొక విధముగా గాని పొందలేరు.

**B.రక్షణ క్రీస్తులో యున్నది**

రక్షణ క్రీస్తులో యున్నదని, క్రీస్తు ద్వారానే దేవుడు రక్షించునని బైబిలు బహు విపులముగా ప్రకటించుచున్నది. పౌలు ఇట్లనెను: "అందుచేత ఏర్పరచబ డినవారు నిత్యమైన మహిమతో కూడ క్రీస్తుయేసునందలి రక్షణ పొందవలెనని నేను వారికొరకు సమస్తము ఓర్చుకొను చున్నాను" (2తిమో2:10). అంతేగాక అపొ.పేతురు క్రీస్తును గూర్చి ఇట్లు పలికెను: "ఇల్లుకట్టువారైన మీరు తృణీకరించిన రాయి ఆయనే; ఆ రాయి మూలకు తలరాయి ఆయెను. మరి ఎవని వలనను రక్షణ కలుగదు; ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము'' (అపొ.కా.4:11-12).

క్రీస్తు యేసునందు రక్షణ పొందవచ్చు నని అపొ.పౌలు చెప్పుచున్నందున, మరింకొక చోట ప్రజలు రక్షణ పొంద లేరా ? యనే ప్రశ్నను మనమ డుగవచ్చును. అయితే మరి ఎవని వలనను రక్షణ కలుగదు అని పేతురు ఖచ్చితముగాను, విపులముగాను చెప్పుచున్నాడు. గనుక క్రీస్తులోనే రక్షణ యున్నది గాని మరింకెక్కడా లేదని బైబిలు వక్కాణించున్నది. జలప్రళయము నుండి రక్షణను పేతురు ఒక ఖచ్చితమైన ప్రదేశములో ఎట్లుంచెనో అట్లే ప్రేరితు లైన వారు రక్షణను ఒక ఖచ్చితమైన ప్రదేశములో యుంచిరి. ఒకటి ఓడలో యుండెను, మరొకటి క్రీస్తులో యున్నది. ఈనాడు రక్షణ మరొకచోట ఎక్కడ లభించదు; అది క్రీస్తు యేసులో మాత్రమే దొరుకును. గనుక రక్షింపబడు టకు అనేక మార్గములున్నవని భావించు నప్పుడు మానవులు అపోహపడు

చున్నారు. పరలోకమునకు వెయ్యి మార్గములు లేవు; రెండు కూడా లేవు. యేసు ఒక్కడే ఆ మార్గము. ఆయన ఒక మార్గము కాదు; ఆయనే మార్గము.

"నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు" అని యేసు ప్రకటించెను (యోహాను 14:6). రక్షణ క్రీస్తులో తప్ప వేరొకచోట ఎక్కడ లేనందున మానవులు రక్షణను ఇంకెక్కడ పొందలేరు. గనుక రక్షణ పొందే ప్రదేశము ఆయన లోనే యున్నది.

**౨.క్రీస్తులో యున్న దీవెనలు యేమిటి ?**

**A.ఆత్మీయ ఆశీర్వాదములన్నియు క్రీస్తులో యున్నవి**

"మనప్రభువైన యేసు క్రీస్తు యొక్క తండ్రియగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తునందు పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకనుగ్రహించెను" అని అపొ.పౌలు ప్రకటించెను (ఎఫెసీ 1:3). క్రీస్తులో యున్న అనేక దీవెనలలో కొన్నిటిని మరియు క్రీస్తులో యుండుట అనగా యేమిటో యను దానిని గమనించుము:

**1. విమోచన క్రీస్తులో యున్నది:** "కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడు చున్నారు" (రోమా 3:24). రక్షణకు లేక పాపక్షమాపణకు ఉన్న వేరొక పదము విమోచనము. పాపమునుండి మానవుని విమోచించుటకు క్రీస్తు చనిపోయెను. అయితే ఆయన రక్తము యొక్క క్రయ ధనముచే కొనబడు నిమిత్తము ఆ విమోచనమున్న స్థావరపు సరిహద్దుల లోనికి ఒకడు రావలెను (1పేతురు 1:18,19;ఎఫెసీ 2:13). గనుక విమోచనము షరతులపై ఆధారపడి యున్నది.

**2. క్షమాపణ క్రీస్తులో యున్నది:** "ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగు చున్నది" (కొలస్స 1:14). పాప క్షమాపణ క్రీస్తులో యున్నందున ఒకడు తన పాపములు క్షమించబడవలెనంటే అతడు ఆయనలో యుండవలెను (ఎఫెసీ 1:7).

**3. ఒకడు క్రీస్తులో నూతన సృష్టి:** "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతనసృష్టి ; పాతవి గతించెను,

ఇదిగో క్రొత్తవాయెను" (2కొరింథీ 5:17). క్రొత్తగా జన్మినించిన వాడే నూతనసృష్టి (యోహాను 3:5). అనగా అతడు క్రైస్తవుడు అయితే క్రీస్తుకు వెలుపల యెవడును నూతన సృష్టికాడు.

**4. జీవము క్రీస్తులో యున్నది.** "ఆయనలో జీవముండెను; ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను" (యోహాను 1:4). "ఆ సాక్ష్యమేమనగా దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను. ఈజీవము ఆయన కుమారుని యందున్నది. దేవుని కుమారుని అంగీకరించువాడు జీవము గలవాడు; దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవము లేనివాడే" (యోహాను 5:11,12).

ఒకడు ఆత్మీయ జీవమునను భవించుచు అది దొరుకని ప్రదేశములో యుండనేరడు. మరల ఉదాహరణకు: కాలారంభమున వివిధ ప్రాణులకు ఆయా స్థానములను దేవుడు ఏర్పరచెను చేపలు నీటిలో యుండవలెనని ఆయన ఆదేశించెను. ఏచేపయైనను నీటికి వెలుపల జీవించగలదా ? లేదు. వాటి భౌతిక జీవనమును దేవుడెక్కడ నిర్దేశించెనో అక్కడే చేపలు జీవించవలెను దీని అనుసరణనే ఇప్పుడు గమనించుము దేవుడు ఆత్మీయజీవమును ఎక్కడ ఉంచెను ? నిశ్చయముగా అది క్రీస్తులోనే యున్నది. కుమారుని కలిగియున్న ప్రతివాడు కుమారునికున్న జీవమునే కలిగియుండును. గనుక మానవునికి ఆత్మీయ జీవముగల ప్రదేశము 'క్రీస్తులో'యని గ్రహించవలెను.

**5. ఒకడు క్రీస్తులో సమాధానము పొందును:** "సమస్తమును దేవుని వలననైనవి; ఆయన మనలను క్రీస్తు ద్వారా తనతో సమాధానపరచుకొని, ఆసమాధాన పరచు పరిచర్యను మాకు అనుగ్రహించెను. అదేమనగా దేవుడు వారి అపరాధములను వారిమీద మోపక క్రీస్తునందు లోకమును తనతో సమాధాన పరచుకొనుచు ఆ సమాధాన వాక్యమును మాకు అప్పగించెను. కావున....దేవునితో సమాధానపడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బతిమాలుకొనుచున్నాము" (2కొరింథీ 5:18-20).

సమాధానము అనునది పాపక్షమాపణను, రక్షణను సూచించు మరియొక పదము. దేవుడు మానవుడు సమాధాన

పరచబడినప్పుడు మానవుని పాపములు క్షమించబడును; అతడు మరల దేవునితో ఏకపరచబడును. దేవుడు మానవుడు క్రీస్తులో కలియుదురు; గనుక క్రీస్తులో యుండుట అనగా దేవునితో సమాధాన పడుటయని అర్ధము.

**6. ఆయన శరీరములో ఒకడు సమాధానపరచబడును:** "తన సిలువ వలన... వీరిద్దరిని ఏక శరీరముగా చేసి, దేవునితో సమాధాన పరచవలెనని ఈలాగు చేసెను. గనుక ఆయనయే మనకు సమాధాన కారకుడై యున్నాడు" (ఎఫెసీ 2:16). కనుక దేవునితో సమాధాన పడుటకు మానవుడు ఆ ఒకే శరీరములో యుండవలెను; ఆ ఒకే శరీరములో యుండుట అనగా క్రీస్తులో ఉండుటయే.

**B. క్రీస్తులో యుండుట అనగా సంఘములో ఉండుటయే**

ఆ ఒకే శరీరమే సంఘమని బైబిలు వివరించుచున్నది: "మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి, సమస్తముపైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను, ఆ సంఘము ఆయన శరీరము; సమస్తమును పూర్తిగా నింపుచున్నవాని సంపూర్ణతయై యున్నది" (ఎఫెసీ 1:22,23). "సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు" (కొలస్స 1:18). "సంఘము అను శరీరము కొరకు..."(కొలస్స 1:24). గనుక క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటయే.

దేవునితో సమాధాన పరచబడుట అనగా, పాపములు క్షమించబడుట అని యర్ధము గనుక, ప్రజలు సంఘములో రక్షించబడుదురు క్షమించబడుదురు లేక సమాధానపరచబడుదురు.

ఇప్పటి వరకు లేఖనముల నుండి ఈ దిగువ సంగతులు ధృవపరచబడెను: 1) ప్రజలు ఒకే శరీరములో సమాధాన పరచబడుదురు (ఎఫెసీ 2:16). 2) ఆ శరీరము సంఘము (ఎఫెసీ 1:22,23; **కొలస్స 1:18,24**). 3). గనుక ఆ ఒకే శరీరమైన సంఘములో ప్రజలు రక్షించబడుదురు లేక సమాధాన పరచబడుదురు.

సంఘమను శరీరమునకు రక్షకుడు క్రీస్తేయని బైబిలు బోధించుచున్నది: "క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్న లాగున పురుషుడు భార్యకు శిరస్సై యున్నాడు. క్రీస్తే శరీరమునకు రక్షకుడై

యున్నాడు" (ఎఫెసీ 5:23). సంఘము క్రీస్తు శరీరమై యున్నందునను, మరియు క్రీస్తు శరీరమునకు రక్షకుడైనందునను ఒకడు రక్షింపబడి ఆయన సంఘములో సభ్యుడు కాకుండ యెట్లుండగలడు ? రక్షింపబడవలెనంటె ఒకడు క్రీస్తు దేనికి రక్షకుడైయున్నాడో దానిలో సభ్యుడుగ యుండవలెను.

'సంఘము ఎవరిని రక్షించదు' అనే మాటలను మనము తరచు విను చుందుము. ఇది నిజమే. అయినను ప్రభువు సంఘమునకు వెలుపల యెవడైన రక్షింపబడునని ఇది నిరూపించుట లేదు. సంఘము యెవరిని రక్షించదను మాట నిజమే గాని క్రీస్తు సంఘమును రక్షించును. గనుక ఎవరు క్రీస్తు శరీరములో యుందురో వారికే రక్షణ వాగ్దానము చేయబడినది. సంఘము రక్షకుడు కాదుగాని, అది రక్షింపబడినవారు, రక్షింపబడిన వారందరు సంఘములో యుందురు; లేక రక్షింపబడినవారే సంఘము. "మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (సంఘముతో) చేర్చుచుండెను" అని బైబిలు చెప్పుచున్నది (అపో.కా. 2:47). ప్రజలను ప్రభువు రక్షించి వారిని అదే సమయమందు తన సంఘములో చేర్చునని ఈ వచనము చెప్పుచున్నది. వారు మొదట రక్షించబడి తరువాత చేర్చబడలేదు. లేక చేర్చబడి రక్షింపబడ లేదు. గాని వారు చేర్చబడుటలో రక్షించబడిరి, రక్షింపబడుటలో చేర్చబడిరి.

మరొక సమీక్షను గమనించుము:

1) రక్షణ క్రీస్తులో యున్నది గనుక, రక్షింపబడుట యనగా క్రీస్తులో నుండుటయే (2తిమో 2:10).

2) రక్షింపబడుట సంఘములో యుండుట సమానమే. ఏలయనగా రక్షింపబడువారిని ప్రభువు సంఘముతో చేర్చును (అపో.కా. 2:47).)

3) గనుక క్రీస్తులో యుండుట అనగా ఆయన సంఘములో యుండుటయే.

ఈ లేఖనముల ముగింపు ఈ విధముగా యున్నది :

ఒకడు క్రీస్తులో యుండి ఆయన సంఘమునకు వెలుపల యుండలేడు. ఏలయనగా సంఘము క్రీస్తు శరీరమై యున్నది. ఒకడు రక్షింపబడవలెనంటే

క్రీస్తులోనికి ప్రవేశించుట అవసరము, ఆయన సంఘములో యుండుట అవసరము. ప్రభువుయొక్క ఆత్మీయ శరీరమవైన సంఘములో రక్షణ యున్నది. రక్షింపబడుచున్న వారి నందరినీ సంఘములో ప్రభువు చేర్చు చున్నందున క్రొత్త నిబంధన సంఘము నకు వెలుపల రక్షింపబడిన వారెవరును లేరు.

**C.క్రైస్తవులందరు సంఘములో యున్నారు**

సంఘసభ్యుడు కాకుండా యెవడును క్రైస్తవుడు కానేరడు ఏలయనగా ఒకడు దేనివలన క్రైస్తవుడగునో దానివలననే రక్షింపబడి సంఘముతో చేర్చబడును. క్రైస్తవులందరు సంఘసభ్యులు మరియు సంఘసభ్యులు మాత్రమే క్రైస్తవులు. గనుక సంఘసభ్యుడు కాని వాడెవడును రక్షింపబలేడు, క్రైస్తవుడు కానేరడు.

ప్రభువు సంఘమునకు వెలుపల ప్రజలు రక్షింపబడగలిగిన యెడల వారు లోకములోనే రక్షింపబడగలరు (కొలస్స 1:13-14). సంఘము అను పదము నకు పిలువబడిన వారిని యర్థము. ఆత్మీయరాజ్యములు రెండున్నవి: అవేవనగా - సాతాను రాజ్యము, క్రీస్తురాజ్యము. రక్షించబడినవారందరు క్రీస్తు రాజ్యమను సంఘములోనికి మార్చబడియున్నారు (మత్తయి 16:18,19). మరల సంఘము దేవుని మందిరమై యున్నది (1తిమో 3:15). ఒకడు సంఘమునకు వెలుపల రక్షింపబడగల్గితే, అతడు శరీరమునకు వెలుపల రక్షింపబడగలడు. దేవుని రాజ్యమునకు దేవుని కుటుంబమునకు వెలుపల రక్షింపబడగల్గితే సంఘములో దేవుడు వేటిని ఉంచెనో వాటిని లేకుండా రక్షింపబడగలడు. క్రీస్తునందు సమస్త ఆత్మీయాశీర్వాదములు ఉన్నవి. క్రీస్తు లోనే ఒకడు వీటిని అనుభవించగలడు. క్రీస్తులో యుండుట అనగా సంఘమైన ఆయన శరీరములో యుండుటయే.

(సశేషము) **-పెర్రికోతమ్**

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న **'సత్యవాణి'** టి.వి. కార్యక్రములను
ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు **మాటీ.వి.**లోను మరియు
ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు **తేజ ఛానల్** లోను
చూడండి.

# బైబిల్ ప్రశ్నోత్తరి

1.యేసుక్రీస్తు మొట్టమొదటి సూచన క్రియ ఎక్కడ చేసారు ?

2.అబ్రాహాము రెండవ భార్యపేరు ఏమిటి ?

3. మన దేశము (హిందూదేశము) బైబిల్‌లో ఎక్కడ ఉన్నది ?

4. ఎక్కువ సంవత్సరములు బ్రతికిన వ్యక్తి ఎవరు ? ఎన్ని సంవత్సరములు బ్రతికెను ?

5. పౌలు ఎక్కడ జన్మించెను ?

6. సొలొమోను కుమారుడు ఎవరు ? అతని తల్లి పేరు ఏమిటి ?

7. తలమీద వెంట్రుకలు తక్కువ ఉన్న ప్రవక్త ఎవరు ? "బోడివాడా ... బోడివాడా ...అని ఎవరిని ఏడిపించారు ?

8. దావీదును, నువ్వు చేసినది తప్పు అని చెప్పిన ప్రవక్త ఎవరు ?

9. వేశ్యను పెండ్లి చేసుకొనిన ప్రవక్త ఎవరు ?

10.సొలొమోను తల్లి ఎవరు ?

11. ఎవని భార్య భర్తతో "దేవుని దూషించి మరణము కమ్మనెను" ?

12. మొట్ట మొదటి ప్రధాన యాజకుడు ఎవరు ? అతడు ఏ వంశస్థుడు ?

13. అహరోను కుమారులు ఎంతమంది ? వారి పేర్లు ఏమిటి ?

14. గొల్యాతు యొక్క పొడవు ఎంత ?

15. ఎవరి దినములలో భూమి దేశములుగా విభాగింపబడెను ?

**సమాధానములు:**

1.గలియలోని కానాలో చేసారు.(యోహాను 2 :11). 2.కెతూరా ఈమె మిద్యానీయుల తల్లి, హాగరు అబ్రాహాము యొక్క ఉపపత్ని (ఆదికాండము 25 : 1-4). 3.ఎస్తేరు 1:1. 4.మెతూషెల, 969 సంవత్సరబ్రతికెను.(ఆదికాండము 5:24). 5.కిలికియలోనున్న తార్సులో జన్మించెను. (అపోస్తలుల కార్యములు 22:3). 6.రెహబము అతని తల్లి పేరు నయమా ఈమె అమ్మోనీయురాలు (I రాజులు 14:21). 7.ఎలీషా (2 రాజులు 2:23). 8.నాతాను ( సమూయేలు 12వ అధ్యాయము). 9.హోషేయ (హోషేయ 1:2). 10. బత్షెబ(2సమూయేలు 12:24). 11.యోబు భార్య (యోబు 2:9). 12. అహరోను అతడు లేవీ వంశస్థుడు (లేవీయ కాండము 7:30-36). 13.నలుగురు కుమారులు వారు (1) నాదాబు (2) అబీహు (3) ఎలియాజరు (4) ఈతామారు (లేవీయ కాండము 10:1 &12). 14. ఆరు మూరల జానెడు (1 సమయేలు 17:4). 15.పెలెగు (ఆదికాండము 10:25).

**-రిక్కి & సుదీప గూటం**

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

SATYA VANI, P.O.BOX-80,KAKINADA-533 001.

సంఘమును నడిపించుచున్నారు. ఈ యువకుల సదస్సుకు హాజరైన వారందరికి స్థానిక సంఘము చక్కటి భోజన పానాదులను ఏర్పాటు చేసిరి. జాన్‌విక్టర్ గారు, వారి సతీమణి మేరీ రత్నం గార్లు చేసిన మంచికృషికి అభినందనీయులు.

ఏప్రల్ 25వ తేదీ మంగళవారం నాడు రిక్కీ గూటం గారు సతీ సమేతముగా బయలుదేరి కలకత్తా వెళ్ళిరి. 26వ తేదీ సాయంకాలం ఆ దంపతులిద్దరూ కలకత్తా స్కూలు ఆఫ్ ప్రీచింగ్ దర్శించిరి. కలకత్తా క్రీస్తు సంఘసువార్తికులు కె.స్వామిదాసు గారు, ఆ దంపతులకు చక్కటి ఆతిధ్యమిచ్చిరి. 27వ తేదీ ఉదయం రిక్కీ గూటం దంపతులు విమానంలో గౌహతికి చేరుకొనిరి. అక్కడ ఈశాన్య రాష్ట్రముల యువకుల సదస్సులో తదుపరి మూడు దినములు,వాక్యపరిచర్య చేసిరి. ఆ సదస్సుకు అస్సాం, మణిపూర్, నాగాలాండ్ మరియు పరిసర రాష్ట్రముల నుండి అనేక యువతీ యువకులు హాజరైరి. గొప్ప ఆత్మీయ విందులో పాల్గొనిరి. రిక్కీ గారి వాక్యపరిచర్యకు హాజరైన వారందరూ ఎంతో మేలు పొందిరి. ఈశాన్య రాష్ట్రముల యువకుల సదస్సుకు సోదరులు శ్యామ్ సలామ్ గారు నాయకత్వం వహించిరి. ఈశాన్య రాష్ట్రముల పర్యటన ముగించుకుని రిక్కీ గూటం గారు, మే 6వ తేదీ నాటికి కాకినాడ చేరుకొందురు.

సోదరులు జాషువా గూటం గారు అనారోగ్యము నుండి దేవుని దయ వలన క్రమముగా కోలుకొనుచున్నారు. ఆయన ఆరోగ్యము నిమిత్తమై ప్రార్థన చేసిన వారందరికీ ఈ పత్రికా ముఖముగా ఆయన కృతజ్ఞత తెలుపుచున్నారు.

## వోయిస్ ఆఫ్ ట్రూత్ ఇంటర్నేషనల్

# Vol. 6

ఇప్పుడు లభించుచున్నది. అది ఉచితం
వలయువారు దిగువ చిరునామాకు వ్రాయండి.

**SATYA VANI**
P.O.Box. 80
Kakinada - 533 001.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004